క్లుప్తంగా

రేషన్ పంపిణీపై డీలర్లతో తహసీల్దార్ సమావేశం



వినుకొండ: జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సురేష్ మాట్లాడుతూ జూన్ నెల నుండి రేషన్ సరుకులు షాపుల వద్ద పంపిణీ చేయాలని, ప్రతినెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ షాపులు తెరిచి ఉంచి రేషన్ కార్డుదారులకు సరుకులు పంపిణీ చేయాలన్నారు. లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు రేషన్ సరుకులు అందజేయాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రాంతాలు

చిలకలూరిపేట: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ ఆర్.అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని వాసవీ నగర్, అర్బన్ పోలీస్ స్టేషన్ రోడ్డు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రోడ్డు, రెడ్ల బజారు, చౌత్రా సెంటర్, నెహ్రూ నగర్ ప్రాంతాల్లో సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

1న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

శావల్యాపురం: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో వచ్చే ఆదివారం ఉదయం 10 గంటలకు 2002–2003 పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రతినిధి చెన్నంశెట్టి సాంబశివరావు (సాంబ) మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శావల్యాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు సహకారంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.

అహల్యబాయ్ పరమధార్మిక భక్తురాలు

రెంటచింతల: పుణ్యశ్లోక అహల్యబాయ్ హోల్కర్ బాల్యం నుంచి పరమేశ్వరుడికి పరమ భక్తురాలని బీజేపీ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కేతనబోయిన హనుమంతరావు అన్నారు. స్థానిక రామ మందిరంలో మంగళవారం నిర్వహించిన పుణ్య శ్లోక అహల్యబాయ్ హోల్కర్ జయంతి నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు బోయ నాగిరెడ్డి, నాయకులు పోకూరి కాశీపతి, కె.రాజేశ్వరరావు, ఎ.గోవర్ధన చారి, ఎం.సురేష్ బాబు, బి.ఏడుకొండలు, పి.ప్రభా వతి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

జిల్లా డిప్యూటీ వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పద్మావతి



రాజుపాలెం: ఆరోగ్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని పల్నాడు జిల్లా డిప్యూటీ వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పద్మావతి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు రిజిస్టర్, మందుల నిల్వల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవితేజ నాయక్‌తో మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులు, ఎన్‌సీడీ సర్వే, ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు, ఈ కేవైసీ సర్వే వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గర్భిణుల వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

నకరికల్లు: అనారోగ్యం తాళలేక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని దేచవరం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దేచవరం గ్రామానికి చెందిన వల్లెపు సుబ్బారావు (68) గత ఆరునెలలుగా క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో అనారోగ్య సమస్య తాళలేక సోమవారం ఇంటి వద్దనే పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు నరసరావుపేటలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. ఘటనపై మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చల్లా సురేష్ మంగళవారం తెలిపారు.

ఎస్పీ దిశా నిర్దేశం



'అనుమతి లేకుండా ఎవరినీ లాకప్‌లో ఉంచ వద్దు.. దర్యాప్తులో ఉన్న కేసుల్లో బాధితులకు సత్వరమే న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోండి.. అక్రమ మద్యం, ఇసుక, గంజాయి మొదలైన నిషేధిత పదార్థాల అక్రమణ రవాణా, నిల్వలపై ప్రత్యేక దృష్టి పెట్టండి.. రాత్రి వేళల్లో గస్తీని ముమ్మరం చేయండి' అంటూ జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆయన రొంపిచర్ల పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో నెలకొన్న పరిస్థితులు, సిబ్బంది పనితీరును ఆయన పరిశీలించారు. రిసెప్షన్‌లో ఉన్న కంప్లైంట్ రిజిస్టర్‌ను ఆయన పరిశీలించారు. రిసెప్షన్‌లో ఉన్న సిబ్బంది పనితీరు, వారి విధులు ఏవిధంగా నిర్వర్తిస్తున్నారో తెలుసుకున్నారు. మహిళలపై జరుగుతున్న నేరాల అరికట్టడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సైబర్ నేరాలపై గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, పోక్సో నేరాలపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో, విద్యార్థుల్లో విస్తృత అవగాహన కలిగించాలని ఆదేశించారు. ఎస్పీ వెంట ఎస్‌బీ సీఐ బండారు సురేష్ బాబు, రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ మణికృష్ణ పాల్గొన్నారు.

–రొంపిచర్ల

సాగర్ జలాలతో చెరువులు నింపుకోండి



సాగర్ జలాలు ఈనెల 30 వరకు విడుదల అవుతున్న దృష్ట్యా మండలంలోని అన్ని మంచినీటి చెరువులను సాగర్ జలాలతో మంచినీటి చెరువులను నింపుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.రత్నబాబు సూచించారు. మంగళవారం మండలంలోని కారుమంచి, మతుకుమల్లి, వయ్యకల్లు, ముండ్రువారి పాలెం గ్రామాల్లో ఉన్న మంచినీటి చెరువులను ఆయన సందర్శించారు. సాగర్ జలాలను తాగునీటి అవసరాల నిమిత్తం ప్రభుత్వం ప్రత్యేకంగా విడుదల చేసిందన్నారు. అనంతరం ఏబీసీ కెనాల్ పరిధిలోని మేజర్ల నుంచి విడుదల అవుతున్న నీటి సామర్థ్యాన్ని ఆయన నిశితంగా పరిశీలించారు.

–శావల్యాపురం

లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలి

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.నరేంద్రరెడ్డి

చిలకలూరిపేట: రాజీ పడదగిన కేసులను లోక్ అదాలత్‌లో సులభంగా పరిష్కరించుకోవచ్చని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.నరేంద్రరెడ్డి చెప్పారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జూలై ఐదో తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో రాజీపడదగిన క్రిమినల్, సివిల్, భరణం, చెక్‌బౌన్స్ వంటి కేసులు రాజీ చేస్తామన్నారు. చిలకలూరిపేటలోని రెండు న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న రాజీపడదగిన కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. దీనికోసం ప్రతిరోజూ కోర్టులో ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్స్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న డీవైఈవో ఎస్ఎం సుభాని



వేసవి శిక్షణ ముగించుకున్న విద్యార్థులు

యద్దనపూడి: ప్రతిరోజు పాఠ్యాంశానికి సంబంధించి ప్రశ్నలు వేసే అలవాటు విద్యార్థుల్లో లోతైన అవగాహన పెంపొందించేందుకు దోహదం చేస్తుందని డీవైఈవో షేక్ మహబూబ్ సుభాని పేర్కొన్నారు. బాసట సామాజిక, సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వేసవి శిక్షణ శిబిరం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఎస్.కాళిదాసు అధ్యక్షత వహించగా డీవైఈవో పాల్గొని విద్యార్థుల్లో సమయపాలన, క్రమశిక్షణను పాటించే విషయాలపై వివరించారు. ఎంఈఓలు ఎంవీ నాగరత్నం, ఎస్ అరుణకుమారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈ శిక్షణ శిబిరం ఎంతగానో తోడ్పడిందని అభిప్రాయపడ్డారు. మాజీ ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్ పోపూరి గంగయ్య చౌదరి, బాసట గౌరవ సలహాదారు ఆలకం పెద్దబ్బాయి కూడా విద్యార్థులకు ఇది మంచి అవకాశం అని పేర్కొన్నారు. శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు నారాయణ స్కూల్ ప్రిన్సిపల్ పి.సృజన, డైరెక్టర్ పోపూరి వెంకటేశ్వర్లను వక్తలు ప్రత్యేకంగా అభినందించారు. సొలస ఎంపీపీఎస్ ఉపాధ్యాయుడు షేక్ జున్ను మాస్టార్ డీఈవో చంద్రకళపై రూపొందించిన క్యాలీగ్రఫీ చిత్రాలను డీవైఈవోకు అందజేశారు. కార్యక్రమానికి పీఠికగా పీటర్ మాస్టారు గేయాన్ని ఆలపించారు. కార్యక్రమంలో బాసట ప్రధాన కార్యదర్శి సామినేని శ్రీనివాసరావు, కల్లూరు శ్రీనివాస్ (వాసు) కేత రామ బ్రహ్మం, సభ్యులు ముత్తవరపు రవీంద్రబాబు, రావూరి సుమన్, పోపూరి శ్రీనివాస్ రావు, కోయ రామోజీరావు, రిటైర్డ్ లెక్చరర్ జొన్నలగడ్డ శేషయ్య, నారాయణ స్కూల్ ప్రిన్సిపల్ పి. సృజన, రావిశెట్టి నాగేశ్వరరావు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగ శిక్షణలో పాల్గొన్న సిబ్బంది

నరసరావుపేట రూరల్: యోగతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎంపీడీవీ టీవీ కృష్ణకుమారి తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణకుమారి మాట్లాడుతూ ఆధునిక జీవనశైలిలో ప్రజలు అనేక శారీరక, మానసిక రుగ్మతలకు గురవుతున్నారని తెలిపారు. యోగ, ధ్యానం చేయడం ద్వారా వీటిని దూరం చేసుకోవచ్చని సూచించారు. రోజు గంట పాటు యోగ సాధన చేయడం ద్వారా ఆరోగ్యానికి మేలు జరుగుతుందని తెలిపారు. శిక్షణలో పాల్గొన్న సిబ్బంది గ్రామస్థాయిలో ప్రజలకు యోగాపై అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ పి.నాగానంద్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూజెండ్లలో...

నూజెండ్ల: విశ్వమంతా యోగాతో ఆరోగ్యం అనే నినాదంతో నిర్వహించనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయడానికి మండలస్థాయి అధికారులు, సిబ్బంది బాధ్యత తీసుకోవాలని ఎంపీడీవో ఉమాదేవి వెల్లడించారు. జూన్ 21న జరగనున్న యోగాంధ్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలస్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగుల ప్రత్యేక కార్యాచరణపై మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం జరిగింది. కార్యక్రమ నిర్వహణపై ఎంపీడీవో ఉమాదేవి పవర్ ప్రజంటేషన్ ఇచ్చారు. అధికారులు యోగా సాధనపై ప్రజలందరికీ అవగాహన కల్పించాలన్నారు.

కార్యక్రమంలో పాల్గొనే ప్రతి ఒక్కరి పేర్లు నమోదు చేయాలన్నారు. ప్రతి ఒక్క రూ యోగాను తమ దిన చర్యలో భాగంగా చేసుకోవాలని ఎంపీడీవో సూచించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై కిశోరి వికాసం చైతన్య శిబిరం



అవగాహన కల్పిస్తున్న శాంతకుమారి

యద్దనపూడి: మండలంలోని కొత్తపాలెం, కొండవీడు గ్రామాల్లో కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా సైబర్ నేరాలపై అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో జి.శాంతకుమారి, డీసీపీయూ ఐపీవో ప్రశాంతి పాల్గొని ప్రసంగించారు. పెరుగుతున్న సైబర్ ఆర్థిక నేరాలు, వాటి మోసపూరిత ధోరణులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అంశాలపై చర్చించారు.

సాంకేతిక పరిజ్ఞాన వృద్ధితో పాటుగా నేరాలు కూడా మారుతున్న తరుణంలో, యువతను, మహిళలను డిజిటల్ భద్రతపై చైతన్యవంతులుగా చేయడం ముఖ్య మని వారు సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం జోజమ్మ, కొత్తపాలెం అంగన్వాడీ కార్యకర్త యశోదా దేవి, కొండవీడు అంగన్వాడీ కార్యకర్తలు నళిని, కరిమున్ పాల్గొన్నారు.

వీధి నాటకాలతో హెచ్ఐవీపై అవగాహన



వినుకొండ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక శివయ్య స్థూపం సెంటర్‌లో కళాజాతర బృందాల ద్వారా హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. వీధి నాటకాల ద్వారా హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలని, హెచ్ఐవీ వస్తే తీసుకోవాల్సి చర్యలు గురించి వివరించారు. ఏఆర్‌టీ కేంద్రా ద్వారా ఇచ్చే మందులు క్రమం తప్పకుండా వాడినట్లయితే జీవితకాలాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. సీడీ 4, వైరల్ లోడ్ పరీక్షలు చేయించుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ సురేష్, ఓఆర్‌డబ్ల్యూ ఎస్‌కే ఆశ, డి.జయకుమారి, విజయ, రమేష్, సీహెచ్.జకరయ్య, బి.రిబ్కా, రహంతున్నేసా, టార్గెట్ ఇంటర్వెన్షన్ ఎన్‌జీవో హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ సిబ్బంది, వైద్యసిబ్బంది, కళాజాత బృందం పాల్గొన్నారు.

నెహ్రూ సేవలు మరువలేనివి



చాచా నెహ్రూ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళ్ళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ మోహన్

రెంటచింతల: ప్రధాన మంత్రిగా అనేక సంస్కరణలు చేపట్టి దేశాభివృద్ధిలో చాచా నెహ్రూ చేసిన సేవలు మరువలేనివని స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సింహాద్రి మోహన్ అన్నారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన దేశ తొలి ప్రధాన మంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి నిర్వహించారు. తొలుత నెహ్రూ చిత్ర పటం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశంలోని మేధావులు, యువతను చాచా నెహ్రూ స్వాతంత్ర్య ఉద్యమంలోకి ఆకర్షించారని గుర్తు చేశారు. ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు అయిన నెహ్రూ త్యాగాన్ని భారతజాతి ఎప్పటికీ మరువద్దన్నారు. దేశానికి 16 సంవత్సరాలు ప్రధాన మంత్రిగా ఉన్న చాచా నెహ్రూ వ్యవసాయం, పరిశ్రలు రెండు దేశాభివృద్ధికి దోహదపడతాయని గ్రహించి అనేక సంస్కరణలు తీసుకువచ్చిన మేధావిగా పేరు పొందారని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ మండల మాజీ అధ్యక్షులు సూరపురెడ్డి పుల్లారెడ్డి, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ కాకుమాను సురేష్, శ్రీను నాయక్, ఖాసిం, నాజర్ పాల్గొన్నారు.

వికలాంగులు, వృద్ధులకు ఇంటివద్దకే రేషన్

నాదెండ్ల: వికలాంగులు, అరవై ఏళ్ల పైబడిన రేషన్ కార్డుదారులకు ప్రతినెలా 1 నుంచి 5వ తేదీలోగా ఇంటి వద్దకే రేషన్ సరుకులు చేర్చాలని డీలర్లను తహసీల్దార్ ఏవీ రమణ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎండీఎం వాహనాలను రద్దు చేసినందున ప్రతినెలా 1–15 తేదీల వరకూ ఉదయం 8–12 గంటల వరకూ, సాయంత్రం 4–8 గంటల వరకూ రేషన్ షాపులను తెరిచిఉంచి కార్డుదారులకు రేషన్ పంపిణీ చేయాలన్నారు. ప్రతి రేషన్‌షాపు ముందు నేమ్‌బోర్డు, స్టాక్‌బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. 1వ తేదీన ఉదయం ఆ వార్డు పరిధిలోని సీనియర్ సిటిజన్ చేత రిబ్బన్ కట్ చేయించి రేషన్ పంపిణీ ప్రారంభించాలన్నారు. రేషన్‌షాపుల్లో ఉండే వస్తువులు మంచి కండీషన్‌లో ఉండేటట్లు చూసుకోవాలన్నారు. ప్రతి డీలర్ విధిగా రికార్డుల్లో నమోదు చేసి స్టాక్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి డీలర్ రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా ఉండాలని ఆదేశించారు.

టీసీఎస్‌లో ఐటీ ఉద్యోగాలకు కృష్ణవేణి విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ నాతాని

నరసరావుపేట ఈస్ట్: కృష్ణవేణి డిగ్రీ కళాశాలకు చెందిన 15 మంది విద్యార్థులకు టీసీఎస్ (ఐటీ) కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. టీసీఎస్ కంపెనీ దశల వారీగా నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో తమ కళాశాల 2024–25 విద్యా సంవత్సరం ఫైనలియర్ బీఎస్సీ విద్యార్థులు 15 మంది ఉద్యోగాలు సాధించారని వివరించారు. కంపెనీ హెచ్‌ఆర్ ప్రతినిధులు గత ఫిబ్రవరి 14వ తేదీన క్యాంపస్ డ్రైవ్‌లో భాగంగా ఆన్‌లైన్ పరీక్ష, ఏప్రిల్ 14, 15 తేదీలలో ఇంటర్వ్యూలు నిర్వహించారని తెలిపారు. ఆయా ఇంటర్వ్యూల ఫలితాలను ఈనెల 26వ తేదీన ప్రకటించగా, తమ విద్యార్థులు 15 మంది ఎంపికయ్యారని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు తమ విద్యార్థులు టీసీఎస్ (ఐటీ)లో 15, టీసీఎస్ (బీపీఎస్) 15, ఇన్ఫోసిస్ (ఐటీ) 8, విప్రో (ఐటీ) 10 మంది ఎంపికయ్యారని వివరించారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ నాతాని, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం.బాలకోటేశ్వరరావు, అధ్యాపకులు అభినందించారు.

గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలందించాలి

జిల్లా వైద్యాధికారి రవి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రవి

నాదెండ్ల: ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసూతి కాన్పుల సంఖ్య గణనీయంగా పెంచి గర్భిణులు, బాలింతలకు ఉత్తమ సేవలందించాలని జిల్లా వైద్యాధికారి రవి చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ప్రతిరోజూ వైద్యశాలకు ఎంతమంది రోగులు వస్తున్నారు, నెలకు ఎన్ని కాన్పులు జరుగుతున్నాయి, గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఆసుపత్రిలోని వార్డులు, రక్త పరీక్షల కేంద్రం, శస్త్రచికిత్సల గది, మందుల గదిని పరిశీలించారు. రోగులకు అందిస్తున్న సేవలపై సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలల పట్ల ప్రజల్లో నమ్మకం కలిగేలా సేవలందించాలన్నారు. రోజురోజుకు ఓపీ పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరిశుభ్రతపై సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సాయిశ్వేత, జ్ఞానేశ్వరి, సీహెచ్‌వో కమలకుమారి, డీపీవో ఉన్నూరు బాషా, ఎంపీహెచ్ఎస్ కట్టా దిలీప్‌కుమార్, సీసీ హర్షవర్ధన్, హనుమానాయక్ పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



బారులు తీరిన భక్తులు



స్వామివారికి తైలాభిషేకం చేస్తున్న దృశ్యం

మాచర్ల: పట్టణంలోని గంగా పార్వతి నగరేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం శనీశ్వరుడు జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో భక్తులు బారులు తీరి స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. నవగ్రహాలకు తైలాభిషేకం చేశారు. పట్టణంలోని ఇష్టకామేశ్వర స్వామి దేవాలయంలో శనీశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ అర్చకులు వంశీకృష్ణ, భరణీల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

నడికుడి- శ్రీకాళహస్తి రైల్వే లైన్ పూర్తి చేయాలి



గుంటూరు డీఆర్ఎం సుధేష్ణసేన్‌కు వినతి పత్రం అందిస్తున్న చల్లంచర్ల

సత్తెనపల్లి: నడికుడి- శ్రీకాళహస్తి రైల్వే లైన్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు డివిజన్ డీఆర్‌యూసీసీ మెంబర్ చల్లంచర్ల సాంబశివరావు కోరారు. సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్ఎం) సుధేష్ణ సేన్‌కు మంగళవారం ఆయన వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా చల్లంచర్ల సాంబశివరావు మాట్లాడుతూ ఎన్నో దశాబ్దాల కల అయిన నడికుడి – శ్రీకాళహస్తి నూతన రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, అయితే నడికుడి నుంచి పల్నాడు జిల్లాలోని శావల్యాపురం వరకు మాత్రమే పనులు జరిగాయన్నారు. మిగిలిన నిర్మాణ పనుల్లో చాలా కాలంగా ప్రగతి లేదని, ఈ రైల్వే లైన్ నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ రైల్వే లైన్ నిర్మాణం పూర్తయితే గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పాత ఉమ్మడి జిల్లాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ రైల్వే లైన్ పూర్తి అవ్వడం వల్ల తిరుపతి, చెన్నై ప్రయాణం పల్నాడు నుంచి సులభతరంగా ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి కూడా తిరుపతి, చెన్నై వెళ్లేందుకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. అలాగే సత్తెనపల్లి రైల్వే స్టేషన్‌లో కూడా వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్ స్టాప్ ఇచ్చిన ఎడల పట్టణ ప్రజలకు చాలా మేలు జరుగుతుందని, ఆదాయ వనరులు పెరిగే అవకాశం ఉందన్నారు. సికింద్రాబాద్-హౌరా(12704), హౌరా- సికింద్రాబాద్(12703) ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌కు సత్తెనపల్లి రైల్వే స్టేషన్‌లో స్టాప్ ఇవ్వాల్సిందిగా కోరారు.

పిల్లలు మంచి మార్గంలో నడవాలి



రెవరెండ్ ఆలూరి నానిబాబు

అమరావతి: స్థానిక తెలుగు బాప్టిస్ట్ చర్చిలో రెండు రోజుల పాటు తెలుగు బాప్టిస్ట్ సంఘం ఆధ్వర్యంలో వేసవి సెలవులను పుస్కరించుకుని పిల్లలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ ఆలూరి నానిబాబు మాట్లాడుతూ పిల్లలు చిన్న వయసులో మంచి మార్గంలో నడవాలని, మంచి ప్రవర్తన కలిగి ఉండాలని బోధించారు. చిన్న వయసు నుంచి ఎదుటివారి యెడల కరుణ, దయ, జాలి కలిగి తోటి వారిని ప్రేమించగలిగే గుణం అలవర్చుకోవాలన్నారు. సోమవారం ప్రారంభమైన శిక్షణ మంగళవారం సాయంత్రంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తెలుగు బాప్టిస్ట్ సంఘ పెద్దలు పాల్గొన్నారు.

తైక్వాండోలో తులసీతన్మయ్‌కి బంగారు పతకం



నరసరావుపేట ఈస్ట్: శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల విద్యార్థిని వి.తులసీతన్మయ్ అంతర్ రాష్ట్ర తైక్వాండో పోటీల్లో బంగారు పతకం సాధించినట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ యక్కల మధుసూదనరావు మంగళవారం తెలిపారు. యూనిక్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో తెనాలి ఎన్‌టీఆర్ స్టేడియంలో ఈనెల 25న నిర్వహించిన తైక్వాండో ఇన్విటేషనల్ చాంపియన్‌షిప్ – 2025 పోటీలో 49 కేజీల విభాగంలో తులసీ తన్మయ్ బంగారు పతకం సాధించిందని వివరించారు. కళాశాల పాలకవర్గం అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త, జాయింట్ సెక్రటరీ ఊటుకూరి వెంకట అప్పారావు, వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాస సాయి, నర్సింగ్ విభాగం ఏఓ ఏవీఎన్ గుప్త, అధ్యాపకులు అభినందించారు.